# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పశ్చిమ బెంగాల్ లో చొరబాట్లను అరికడతామని, ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు.
- పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి.
- గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగా సాగుతోందని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ తెలిపింది.
- ఐపీఎల్ లో భాగంగా చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్పీజీ (LPG) సిలిండర్ల సరఫరా సాధారణంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నిన్న ఒక్కరోజే దేశ వ్యాప్తంగా 51 లక్షల 50 వేల సిలిండర్లను వినియోగదారులకు చేరవేసినట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపుతూ.. చమురు సంస్థల సహకారంతో నిన్న 3 వేల 400 చోట్ల దాడులు నిర్వహించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన 214 ఏజెన్సీలపై జరిమానా విధించడంతో పాటు తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిన 55 ఏజెన్సీల లైసెన్సులను రద్దు చేసింది. ఎరువుల కర్మాగారాలకు గ్యాస్ కేటాయింపులను మరో 5 శాతం పెంచారు. 20 వేల 400 మెట్రిక్ టన్నుల గ్యాస్ లోడుతో వస్తున్న భారత నౌక "జగ్ విక్రమ్" హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఇది ఏప్రిల్ 15న ముంబై చేరుకోనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఇజ్రాయెల్ దాడులు తగ్గడం, ఇతర ముందస్తు షరతులు నెరవేరడంతో అమెరికా, ఇరాన్, పాకిస్థాన్‌ల మధ్య త్రైపాక్షిక చర్చలు మొదలైనట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ “ఇర్నా” ధృవీకరించింది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, అమెరికా వద్ద నిలిచిపోయిన ఇరాన్ ఆస్తుల విడుదల, హర్మూజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బకర్ ఖలీబాఫ్, అమెరికా ఉపాధ్యక్షులు జె.డి.వాన్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాలు ఈ చర్చల్లో పాల్గొంటున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సాగుతోంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కట్వా, జంగీపూర్, కుష్మండీలలో ఈరోజు జరిగిన మూడు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో చొరబాట్లను అరికడతామని, ఉమ్మడి పౌర స్మృతి (UCC)ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బెంగాలీలు తమ స్వరాష్ట్రంలోనే మైనారిటీలుగా మారే పరిస్థితిని బీజేపీ రానివ్వదని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

అనంతరం సిలిగురిలో నరేంద్ర మోదీ భారీ రోడ్‌షో నిర్వహించారు. మరోవైపు కేంద్ర హోం మంత్రి అమిత్ షా బంకురాలో పర్యటించి, బీజేపీ అధికారంలోకి వస్తే బలుచారీ చీరలకు, పంచమురా టెర్రకోట గుర్రాలకు జీఐ ట్యాగ్ తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, నేపాల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారి-927లోని బారాబంకీ-బహ్రైచ్ సెక్షన్‌ను నాలుగు వరుసల యాక్సెస్-కంట్రోల్డ్ హైవేగా నిర్మించేందుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా రూపైదిహా ల్యాండ్ పోర్ట్, నేపాల్‌లోని నేపాల్‌గంజ్‌లకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ రహదారి నిర్మాణం వల్ల సరిహద్దు వాణిజ్యం వృద్ధి చెందడమే కాకుండా.. స్థానిక జీవనోపాధి మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా బారాబంకీ - బహ్రైచ్ మధ్య ప్రయాణ సమయం 150 నిమిషాల నుంచి 75 నిమిషాలకు తగ్గుతుందని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్‌లో చిక్కుకున్న మరో 312 మంది భారతీయ మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వం సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. అర్మేనియా మీదుగా వీరిని భారత్‌కు తరలించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. ఈ క్లిష్టమైన తరలింపు ప్రక్రియలో సహకారాన్ని అందించిన అర్మేనియా ప్రభుత్వానికి, ఆ దేశ విదేశాంగ మంత్రి అరారత్ మిర్జోయాన్‌కు జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలో మూడు రోజుల పాటు జరిగే “ఉన్నత్ కృషి మహోత్సవ్”ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు. ఈనెల 13 వరకు సాగే ఈ జాతీయ స్థాయి వ్యవసాయ మేళాలో ఆధునిక సాగు పద్ధతులు, డ్రోన్లు, సోలార్ పంపులు, సూక్ష్మ నీటి పారుదల వంటి అత్యాధునిక సాంకేతికతలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని

తెలిపారు. రైతులు ఇంటివద్ద నుండే తమ ఉత్పత్తులను విక్రయించే విధంగా ఆన్‌లైన్ పద్ధతిని తీసుకువచ్చామని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ తీరును అంతర్జాతీయ ప్రతినిధులు ప్రశంసించారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించిన "ఇంటర్నేషనల్ ఎలక్షన్ విజిటర్స్ ప్రోగ్రామ్ 2026"లో భాగంగా 22 దేశాలకు చెందిన 38 మంది ప్రతినిధులు రెండు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు. కేరళంలోని కొచ్చి, తిరువనంతపురం, అసోంలోని కామరూప్ ప్రాంతాల్లో ప్రతినిధుల బృందం పర్యటించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సాంకేతికత వినియోగం, భారీ ఓటింగ్ శాతం తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రతినిధుల బృందం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయంగా ఇంధన లభ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాలను సవరించింది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు ఉన్న 21 రూపాయల 50 పైసల సుంకాన్ని 55 రూపాయల 50 పైసలు పెంచినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదేవిధంగా విమాన ఇంధనంపై సుంకాన్ని లీటరుకు 29 రూపాయల 50 పైసల నుంచి 42 రూపాయలకు పెంచింది. అయితే... పెట్రోల్ ఎగుమతులపై ప్రస్తుతం ఉన్న సున్నా సుంకం యథాతథంగా కొనసాగుతుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ రెండు రోజుల మారిషస్ పర్యటన ఫలప్రదంగా ముగిసింది. ఆరోగ్యం, హరిత ఇంధనం (గ్రీన్ మొబిలిటీ), నైపుణ్యాభివృద్ధి, విద్య, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక రంగాల్లో రెండు దేశాలూ కలిసి పని చేయాలని నిర్ణయించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. భారత్-మారిషస్ సంబంధాల్లో ప్రజల సంక్షేమమే అత్యంత కీలకమని, ఆ దిశగానే ఈ చర్చలు సాగాయని జైస్వాల్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 12 ఓవర్లు పూర్తయేసరికి 1 వికెట్ కోల్పోయి 119 పరుగులు చేసింది.

అంతకు ముందు చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH)పై పంజాబ్ కింగ్స్ (PBKS) 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ మరో 7 బంతులు మిగిలి ఉండగానే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గి, శాశ్వత శాంతి నెలకొనడానికి ప్రస్తుత కాల్పుల విరమణ దోహదపడుతుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా మంత్రి డాక్టర్ మాజిద్ బిన్ అబ్దుల్లా అల్ ఖస్సాబీతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు మాట్లాడారు. యుద్ధం వల్ల ప్రాంతీయ సరఫరా గొలుసు తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని, దీనిని చక్కదిద్దేందుకు ఉమ్మడి కృషితో ముందుకు సాగాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

======================

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వే సుస్థిర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వన్యప్రాణుల సంరక్షణలో ఒక మైలురాయిగా నిలిచిందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ రహదారిలోని 18 కిలోమీటర్ల గణేష్‌పూర్-అషారోడి సెక్షన్‌లో వన్యప్రాణుల రక్షణ కోసం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నట్లు ఆ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా వెల్లడించారు.

======================

======================